మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి

- ప్రతి రోజూ నీటి సరఫరాను తిరిగి ప్రారంభిస్తాం
- మేయర్ సునీల్ రావు

13వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్ రావు

కార్పొరేషన్, సెప్టెంబర్ 9 : నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్లలో వరదతో ప్రజలకు కొంత ఇబ్బందులు తలెత్తాయని. వాటిని పరిష్కరించేందుకు వరద స్కీం కింద రూ.17 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. సోమవారం 13వ డివిజన్‌లోని బతుకమ్మ కాలనీలో రూ.5 లక్షలతో రజక సహకార సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి, 32వ డివిజన్‌లోని అల్కాపూరి సమీపంలో గల వివేకానంద కాలనీలో రూ. 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో మానేరు డ్యాంలో నీటి మట్టం పెరిగినందున రెండు రోజుల్లో నగర ప్రజలకు యథావిధిగా ప్రతి రోజూ నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కట్టరాంపూర్‌లో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పూర్తి చేశామని.. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ రోడ్డు గిద్దె పెరుమాండ్ల వరకు పూర్తి చేశామని, మిగతా రోడ్డు పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో ఏర్పడ్డ కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కల్పనకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా నిధులు సమీకరించి ప్రజల డిమాండ్లు నెరవేరుస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాకు చెందిన నాయకుల సహకారంతో కరీంనగర్‌ను సమస్యలు లేని నగరంగా మార్చుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీవేణు, మర్రి భావనాసతీశ్, డీఈ ఓం ప్రకాశ్, ఏఈ వాణి, వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రవణ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి

రామడుగు, సెప్టెంబర్ 9: ప్రత్యేక తెలంగాణ ఉద్యమనేత యువజన సంఘాల స్ఫూర్తిప్రదాత జిట్టా బాలకృష్ణారెడ్డికి గోపాల్‌రావుపేట జాతీయజెండా కూడలిలో యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆయన అర్థాంతరంగా కన్నుమూసినా యువజనుల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీకాంత్‌గౌడ్, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిట్టా అభిమానులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

కలెక్టరేట్, సెప్టెంబర్ 9 : తెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ కార్యనిర్వాహక సంచాలకుడు ఎం.అనిల్‌ప్రకాశ్‌కిరణ్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈకార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

దామెర చెరువు తూము ధ్వంసం

శంకరపట్నం, సెప్టెంబర్ 9: ముత్తారం దామెర చెరువు తూమును గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై మొలంగూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు, మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూము గేటును ధ్వంసం చేయడంతో చెరువులోని నీరంతా ఖాళీ అవుతున్నదని, దీంతో సాగు నీరు అందక వేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులోని చేపలు బయటకు పోయే ప్రమాదం తలెత్తిందని మత్స్యకారులు వాపోయారు. కాగా, చెరువు కింద గల పంట పొలాలు వరద నీటిలో మునిగి పంటలు నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏటా ఇదో తంతుగా మారుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్

శంకరపట్నం, సెప్టెంబర్ 9: మండలానికి చెందిన గుడుంబా తయారీదారులను సోమవారం ఎక్సైజ్ శాఖ పోలీసులు బైండోవర్ చేశారు. ఇటీవల గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు పలు గ్రామాలకు చెందిన గొల్లెన కుమార్, కల్లూరి రాజకొమురయ్య, కల్లూరి స్వరూప, కల్లూరి రేణుక, కల్లూరి శ్రీనివాస్, కోట పద్మ, కోట లక్ష్మి, కల్లూరి ఐలయ్యను బైండోవర్ చేసి తహసీల్దార్ భాస్కర్ ఎదుట హాజరు పరిచారు. ఇక్కడ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ముకుందరెడ్డి, సిబ్బంది రమేశ్, సంతోష్‌కుమార్, నరేశ్, శ్రుతి, దేవేందర్ ఉన్నారు

వసతి గృహాలు ప్రారంభించాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 9: జిల్లా కేంద్రానికి కేటాయించిన మూడు ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నగర కమిటీ అధ్యక్షుడు ఇషక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎస్సీ సంక్షేమ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ కమిటీ సభ్యులు ఆకాశ్, రాకేశ్, సందేశ్, పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899. NT-331762

RETIRED POLICE SUB INSPECTOR (SI) కావలెను.

యాడ్ ఏజెన్సీ కోసం సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకులో రిటైర్డ్ పోలీసు అధికారిని కన్సల్టెంట్‌గా నియమించుకోడానికి వెతుకుతున్నాము. నెలవారీ వేతనం నెలకు రూ. 30,000/- నెలలో 10 రోజులు మాత్రమే పని దినాలు.

వివరాల కోసం సంప్రదించండి

Suryodaya Colony Near Kamineni Hospital, LB Nagar Hyderabad-500074 Cell: 8499000333 You Can Also Send your Details to hrsribalajiads@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571 9182 777 189

మా సమస్యలు పరిష్కరించరూ..!

- ప్రజావాణిలో సామాన్యుల గోడు
- కార్యక్రమానికి మొత్తం 227 దరఖాస్తులు

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కలెక్టరేట్, సెప్టెంబర్ 9: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలకు ఇప్పటివరకు మోక్షం లభించలేదని, ఇప్పడైనా పరిష్కరించరూ.. అంటూ పలువురు పేదలు ప్రజావాణిలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. నెల రోజుల విరామానాంతరం సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా విన్నవించారు. కార్యక్రమంలో మొత్తం 227 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి సత్వర న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలంటూ కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీలను ప్రభుత్వ విభాగాల వారీగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేశారు. అధికారుల నిర్లక్ష్యంతో కొనసాగుతున్న భూకబ్జాలు, సంక్షేమ పథకాల అమలులో వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై అత్యధిక మంది ఫిర్యాదు చేశారు.

పింఛన్ పునరుద్ధరించండి

నా భర్త మరణానంతరం మంజూరైన వితంతువు పింఛన్ కొద్ది నెలలుగా రావడం లేదు. ఆసరా పెన్షన్ ఐడీ నం. కేఆర్ఎంసీడీ 01857 కాగా, అకారణంగా అధికారులు పింఛన్ నిలిపివేశారు. మండల కార్యాలయంలో అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయిన. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-కొన్నె లక్ష్మీకాంతమ్మ, చెల్పూర్, హుజూరాబాద్ మండలం

మాకు ఉపాధి కల్పించరూ

వైద్య కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామంటూ, ఉన్న ఉపాధిని తొలగించారు. ఇప్పడేమో అర్హతల్లేవంటూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ నాలుగుసార్లు ప్రజావాణికి వచ్చినం. ఉపాధి అవకాశాలు మాత్రం కల్పించకపోవడంతో మా కుటుంబాలు పస్తులుంటున్నాయి.

-తెలంగాణ సీడ్స్ సంస్థ కూలీలు

చార్జింగ్ సైకిల్ ఇప్పించండి

పూర్తిస్థాయిలో వికలాంగుడినైన నేను ఇతరుల సాయం లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. నాకు చార్జింగ్ సైకిల్ ఇప్పిస్తే నా పనులు నేనే చూసుకుంట. గతంలో కూడా దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు చార్జింగ్ సైకిల్ మంజూరు కాలేదు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

-పాకాల మల్లయ్య, గ్రామం. మొగిలిపాలెం, తిమ్మాపూర్ మండలం

పరిహారం అందించాలి

గ్రామంలో గల ఊర చెరువులో తమ పొలాలు మునిగిపోతున్నాయంటూ, కొంతమంది రైతులు అధికారుల మద్దతుతో చెరువు కట్టకు గండిపెట్టడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. చెరువు కింది పొలాల్లో ఇసుక మేట వేయడంతో పాటు, చెరువులో పెరుగుతున్న చేపలు కూడా నీటిపాలు కావడం వల్ల లక్షల రూపాయల నష్టం జరిగింది. బాధితులకు పరిహారం అందించాలి.

-రాంచంద్రాపూర్ గ్రామ రైతులు, సైదాపూర్ మండలం

ఇందిరమ్మ కాలనీని డంప్ యార్డుగా వాడుతున్నరు

మేం నివసించేందుకు నిర్మించిన ఇందిరమ్మ కాలనీని డంప్ యార్డుగా వినియోగిస్తుండడంతో, చెత్త కంపుతో అనేక ఇబ్బందులు పడుతున్నం. వెంటనే యార్డు తొలగించాలి. మున్సిపాల్టీ పరిధిలోని చెత్త మొత్తం కాలనీకి వచ్చి చేరుతున్నది. అధికారులు మా పరిస్థితిని అర్థం చేసుకొని, డంప్ యార్డు ఎత్తేసేందుకు చర్యలు తీసుకోవాలి.

-కాలనీ ప్రజలు, జమ్మికుంట మున్సిపాలిటీ

ఘనంగా కాళోజీ జయంతి

రేకుర్తిలోని కాళోజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెరవే బాధ్యులు

కమాన్‌చౌరస్తా/ రాంనగర్/ తెలంగాణచౌక్/ కొత్తపల్లి/ జమ్మికుంట/శంకరపట్నం/ సైదాపూర్/ కరీంనగర్ రూరల్/ చిగురుమామిడి/హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 9 : ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా సోమవారం విద్యాలయాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. నగరంలోని రేకుర్తిలో గల కాళోజీ విగ్రహానికి తెరవే సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెరవే అధ్యక్షుడు సీవీ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ తనానికి కాళోజీ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వాసాల వరప్రసాద్, విలాసారం రవీందర్, ఎక్కలదేవి మధుశ్రీ, బాలసాని కొమురయ్య, గుడికందుల అరుణ్, గసగంటి సంజీవ్, ఎండీ ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో అడిషనల్ డీసీపీ ఎ. లక్ష్మీనారాయణ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ విజయ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్ (అడ్మిన్), కుమారస్వామి (ఎం.టి.వో.), శ్రీధర్ రెడ్డి (వెల్ఫేర్), మినిస్టీరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజాకవి కాళోజీ చిత్రపటానికి డిప్యూటీ ఆర్ఎంలు సత్యనారాయణ, భూపతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టేషన్ మేనేజర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు. రేకుర్తిలోని పారడైజ్ పాఠశాలలో విద్యా సంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి తెలంగాణ భాషా వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి. వసంత, భార్గవ్, నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ ఏ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. 'తెలంగాణ భాషా ప్రాముఖ్యత' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీకర్ బహుమతులు అందజేశారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓదెలు కుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు శ్యామల, రాజేంద్రం, రవి, గణేశ్, మాధవి, ఉమా కిరణ్, సుష్మా, రవిప్రకాశ్, ప్రశాంత్, అరుణ్‌రాజ్, సాయికుమార్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాలతి ఆధ్వర్యంలో 'తెలంగాణ భాషా వైవిధ్యం' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ తెలంగాణ భాషలో వచన, కవిత్వం గురించి వివరించారు. మరో వక్త బూర్ల వెంకటేశ్వర్లు జాతీయాలు, సామెతలు, బంధువాచకాల్లో క్రియా పదాల్లోని తెలంగాణ భాషా ప్రత్యేకతల గురించి తెలిపారు. వర్క్‌షాప్ సమన్వయకర్తగా ఎగ్రోజు వెంకటేశ్వర్లు వ్యవహరించగా, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె. గీతారాణి, రాధిక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే బొమ్మకల్‌లోని బిర్లా స్కూల్‌లో కాళోజీని స్మరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలంగాణ తల్లి, పోతరాజు వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జి. వినోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నాటకాలు, పాటలు, నృత్యాల ద్వారా తెలంగాణ భాష గొప్పతనాన్ని కళ్లకు కట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాషబత్తిని ఓదెలు కుమార్, మంజుల, మాధవి, శ్రీదేవి, వేణు, ఎస్వీఆర్ చారి, జయప్రకాశ్ పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా కవి ఎస్ వెంకటేశ్వర్లు, గౌరవ అతిథులుగా పట్టణ సీఐ తిరుమల్, ఎస్సై యూనస్ హాజరయ్యారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

గంగాధర, సెప్టెంబర్ 9: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించారు. అన్ని రకాల సౌకర్యాలతో అధునాతనంగా సింగిల్ విండో భవనాన్ని నిర్మించిన చైర్మన్ బాలాగౌడ్, పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. ఇక్కడ సింగిల్ విండో డైరెక్టర్లు బెజ్జంకి కళ్యాణ్, నాయకులు జారతి సత్తయ్య, సింగిల్ విండో కార్యదర్శి గాలిపెల్లి రమేశ్ తదితరులు ఉన్నారు.

ఏకాగ్రతతోనే చదువులో రాణిస్తారు

విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతపై అవగాహన కల్పిస్తున్న మెమరీ అండ్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ దైవాల వేణుకుమార్

రామడుగు, సెప్టెంబర్ 9: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే పోటీ పరీక్షల్లో రాణిస్తారని మెమరీ అండ్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్, వరల్డ్ రికార్డు హోల్డర్ దైవాల వేణుకుమార్ పేర్కొన్నారు. వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్, గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి పాఠశాలల్లో సోమవారం పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. చదివిన అంశం గుర్తుండాలంటే ఉపయోగించాల్సిన సాంకేతికత, చిట్కాలను విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షల్లో సమయం కన్నా వేగంగా ఆలోచించి సరైన సమాధానాన్ని గుర్తించడం వంటి విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్స్ ఉప్పుల శ్రీనివాస్, అన్నదానం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పేదల కోసం కేటాయించిన భూమిలో డంప్‌యార్డా'

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 9: వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో జమ్మికుంట మున్సిపల్ పరిధిలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లో ప్రభుత్వం డంప్ యార్డ్ పనులు చేపట్టడమేమిటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. లబ్ధిదారులకు కనీస వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం, ఇండ్లు, స్థలాలను లాక్కోవడం సరికాదన్నారు. వెంటనే డంప్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నరేశ్, నాయకులు వెంకటేశ్వర్లు, కమల, స్వరూప పాల్గొన్నారు.

తెలంగాణ భాష, యాసకు చిరునామా నలిమెల


నలిమెల భాస్కర్‌ను సత్కరిస్తున్న మధుసూదన్ రెడ్డి తదితరులు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన ప్రముఖ కవి, రచయిత, అనువాదకుడు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్‌ను తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి ఘనంగా సత్కరించారు. నలిమెల సాహితీ సేవలు అనన్య సామాన్యమని, ఆయన తెలంగాణ తెలుగు భాష, యాసకు పర్యాయపదంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇక్కడ తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం కార్యదర్శి కవి బొమ్మకంటి కిషన్, కార్యవర్గ సభ్యురాలు, కవయిత్రి అనిత, సభ్యులు తుమ్మల రమేశ్ రెడ్డి, ఎం. మహేందర్, పి. సురేందర్, కె. సత్యం, సాహితీ బంధువు అశోక్ తదితరులు ఉన్నారు.

'అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలి'

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 9: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నరేందర్ రెడ్డికి టికెట్ ఇస్తే తాము పార్టీలకతీతంగా ఆయన గెలుపుకోసం పనిచేస్తామని తెలిపారు.

ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి, సెప్టెంబర్ 9: చింతకుంట గ్రామంలో ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి జి. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో సీనియర్ వైద్యురాలు యాస్రబ్ సుల్తానా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో ఫార్మసిస్టులు మునీర్, సలీముద్దీన్, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

రేకుర్తి కంటి దవాఖాన సేవల విస్తరణకు సహకారం: బండి

కంటి పరీక్షలు చేయించుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

విద్యానగర్, సెప్టెంబర్ 9: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తిలో కంటి దవాఖాన ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు భేష్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కరీంనగర్‌లోని రేకుర్తిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి దవాఖానకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన అవుట్ పేషెంట్ వార్డును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దవాఖానలోని అన్ని వార్డులను కలియదిరిగిన బండి సంజయ్, అక్కడ అందిస్తున్న సేవల వివరాలను లయన్స్ క్లబ్ చైర్మన్ కొండా వేణు మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరికీ కంటి దవాఖాన సేవలు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని, కేంద్ర ఆరోగ్యశాఖతో చర్చించి విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. దీంతోపాటు ఎంపీ లాడ్స్ నుంచి కొంత మేరకు నిధులను కంటి దవాఖానకు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ వేణుమూర్తితోపాటు వైస్ చైర్మన్ చిదుర సురేశ్, కార్యదర్శి ప్రకాశ్ హొల్లా, కోశాధికారి బొమ్మ పవన్ కుమార్, డాక్టర్ మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి, ముక్క శరత్ కృష్ణ, మ్యాడం శివకాంత్, లంబు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట ప్రభుత్వ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పారిపెల్లి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దవాఖానలో మెరుగైన వైద్య సేవలందిస్తానని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాగా, సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనను వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమిని కాపాడండి

చొప్పదండి, సెప్టెంబర్ 9: పట్టణంలోని బ్రాహ్మణకుంట (చెరువు) శిఖం భూమిని కబ్జా నుంచి కాపాడాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ కోరారు. శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలపై సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. చెరువు శిఖంలో ఆరు ఎకరాల భూమికి అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేసి, శిఖం భూమిపై రీ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు. ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్వోసీ ఇవ్వకూడదని, శిఖం భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని కలెక్టర్‌ను కోరారు. కబ్జాదారులతో కుమ్మక్కై బ్రాహ్మణకుంట శిఖం భూమి కబ్జాకు గురికాలేదని గతంలో తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

చొప్పదండి, సెప్టెంబర్ 9: వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు పడకంటి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండపాల్లో నిత్యం తులసి, కుంకుమ, గోమాత పూజలతో పాటు అన్నదానం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరిలో భక్తిభావాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మోలుమూరి రమేశ్, దూస రాము, దండె లింగన్న, ఎన్నం మునీందర్, సిరిపురం శ్రీనివాస్, దండె మహేశ్, చల్ల అనుష్ తదితరులున్నారు.

ఎస్ఐని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, సెప్టెంబర్ 9: ఇటీవల మండలానికి బదిలీపై వచ్చిన ఎస్ఐ తిరుపతిని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు పైడిపల్లి రవీందర్‌గౌడ్, పొడిశెట్టి కొమురయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.

తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబర్9: తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ రమేశ్‌ను కలిశారు. వినతి పత్రం అందించారు. అనంతరం రైతులు వినయ్, భిక్షపతి, రవి, శ్రీధర్, రాజయ్య, మల్లయ్య, తదితరులు మాట్లాడుతూ.. గ్రామంలో తాము ఏళ్లకాలం నుంచి పట్టాదారులుగా ఉన్నామని, సదరు భూములను చెరువు శిఖమని అశోక్ ఫిర్యాదులు చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో అధికారులు కొలతలు వేశారని, పట్టా భూమిగా తేల్చారని చెప్పారు. అయినా, శిఖం భూమేనంటూ అశోక్ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని, రైతులైన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న అశోక్, తదితరులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్రీడా సాంస్కృతిక గృహాల ఆవిర్భావ దినోత్సవం

పారమిత పాఠశాలలో ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

కొత్తపల్లి, సెప్టెంబర్ 9 : స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో సోమవారం క్రీడా సాంస్కృతిక గృహాల ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డా. ఇ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఆజాద్, బోస్, ఝాన్సీ, తిలక్ అనే నాలుగు గృహాలుగా విభజించి, వాటికి హౌస్ మాస్టర్, కో హౌస్ మాస్టర్, కెప్టెన్, వైస్ కెప్టెన్లను నియమించి పోటీలు నిర్వహించారు. ఈ క్రీడాగృహాలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, బృందాలుగా కలిసి పనిచేయడం, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తాయని విద్యా సంస్థల చైర్మన్ ప్రసాదరావు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ టి.ఎస్.వి. రమణ నూతనంగా ఎన్నికైన హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపూర్ కల్వర్టుకు మరమ్మతులు

గంగాధర, సెప్టెంబర్ 9: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నాగిరెడ్డిపూర్ వద్ద కల్వర్టు పూర్తిగా దెబ్బతినగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు సోమవారం అధికారులు మరమ్మతులు చేయించారు. కల్వర్టు వద్ద టిప్పర్లతో మొరం పోయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. కల్వర్టుకు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలకు వాటర్ డిస్పెన్సర్ వితరణ


వాటర్ డిస్పెన్సర్ అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 9 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, సేవ చేయడం చాలా గొప్ప గుణమన్నారు. పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా తాను కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల బరిలో నిలువనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

రవీకాంత్‌రెడ్డిని కలిసిన వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు


రవికాంత్‌రెడ్డితో ఠాగూర్

గంగాధర, సెప్టెంబర్ 9 : ఇండియన్ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత రవికాంత్‌రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ మోహన్‌రావును జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఠాగూర్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఠాగూర్‌ను రవికాంత్‌రెడ్డి, మోహన్‌రావు అభినందించారు.

GAYATRI BANK गायत्रि बैंक గాయత్రి బ్యాంక్

THE GAYATRI CO-OPERATIVE URBAN BANK LTD.

(Regd. No. MSCS/CR/1290/2019, RBI License No. UBD: Hyd.AP/26P/24-05-2000) Multi State Co-Operative Bank
7-1-72,73,74, Gayatri Towers, Near Tahasil Chowrasta, Jagtial-505 327 (Dist.) Telangana State.

AUDITED FINANCIAL STATEMENT OF BALANCE SHEET FOR THE YEAR 2023-24. FORM - 'A' (Amount in Rupees)

LIABILITIES	SCHEDULE NO	AS ON 31-03-2024	AS ON 31-03-2023	ASSETS	SCHEDULE NO	AS ON 31-03-2024	AS ON 31-03-2023
Paid up share Capital	1	66,12,10,514.00	58,34,39,317.00	Cash Balance	6	53,49,89,574.00	52,85,88,666.00
Reserves & Surplus	2	62,23,79,038.33	53,32,03,156.84	Balances with Banks & Call Money	7	69,15,42,516.90	71,11,48,759.89
Deposits	3	1475,95,26,283.39	1321,65,49,072.41	Investments	8	433,52,65,237.00	363,02,52,056.00
Borrowings	4	0.00	0.00	Loans & Advances	9	1050,80,54,653.70	947,44,31,833.71
Other Liabilities & Provisions	5	61,25,19,164.27	62,82,04,502.18	Fixed Assets	10	31,30,39,086.91	26,34,13,522.21
TOTAL LIABILITIES		1665,56,34,999.99	1496,13,96,048.43	Other Assets	11	27,27,43,931.48	35,35,61,210.62
				TOTAL ASSETS		1665,56,34,999.99	1496,13,96,048.43
				Off-Balance Sheet Items	12	21,04,24,659.93	16,32,97,525.33
				Significant Accounting Policies and Notes Accounts forming part of Financial Statements	18 &19		

PROFIT & LOSS ACCOUNT FOR THE YEAR 2023-24. FORM - 'B' (Amount in Rupees)

INCOME	SCHEDULE NO	2023-24	2022-23	EXPENDITURE	SCHEDULE NO	2023-24	2022-23
Interest Earned	13	131,95,77,964.59	116,03,87,116.44	Interest expended	15	80,32,97,885.46	69,97,34,849.50
Other Income	14	15,92,08,670.46	14,74,58,155.90	Operating expenses	16	38,42,96,878.10	37,10,83,281.65
TOTAL		147,87,86,635.05	130,78,45,272.34	Provisions and contingencies	17	6,67,48,000.00	4,61,30,000.00
				TOTAL		125,43,42,763.56	111,69,48,131.15
				Profit Before Tax		22,44,43,871.49	19,08,97,141.19
				Provision for taxation/ Tax Liability		7,03,78,738.00	6,65,71,409.00
				Net Profit For The year (After tax)		15,40,65,133.49	12,43,25,732.19
				Add Profit balance brought forward from previous year			
				Balance of Profit carried forward to Balance Sheet for appropriation		15,40,65,133.49	12,43,25,732.19

Sd/- Chief Executive Officer The Gayatri Co-Op Urban Bank Ltd., Sd/- Director The Gayatri Co-Op Urban Bank Ltd., Sd/- Director The Gayatri Co-Op Urban Bank Ltd.

Sd/- Chairman The Gayatri Co-Op Urban Bank Ltd., Sd/- D.Siva Nageswara Rao & Co., Chartered Accountants